

మరసం...

సాహిత్య ప్రవాహం..

మంజీర రచయితల సంఘానికి 38 ఏళ్లు

సామాజిక ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలోకి..

తెలంగాణ పోరాటానికి వెన్నుదన్ను

కవులు, గాయకులు, రచయితలను తీర్చిదిద్దిన ఘనత

నేడు సిద్దిపేట విపంచి హాల్‌లో వార్షికోత్సవం

హాజరవుతున్న ప్రముఖ కవులు, సాహితీవేత్తలు

"మంజీర రచయితల సంఘం మాది
కన్నీటి వ్యధలన్నీ కథలుగా సృజియించి
శ్రమశక్తి విజయాల కవితలై వెలయించు
చైతన్య సాగర తరంగం మాది"

..అంటూ సాహిత్య పరిమళాలను సామాజిక ఉద్యమాల కోసం వెదజల్లిన ఘనత మంజీర రచయితల సంఘానిది. 'మ.ర.సం'గా ఆవిర్భవించి మెతుకుసీమ తనువంతా స్ఫురించి చైతన్యాన్ని రేకెత్తించిన సాహితీ సంస్థ ఇది. 1986లో పురుడుపోసుకొని 38 ఏళ్లపాటు ప్రజా ఉద్యమాలు, ప్రత్యేక పోరాటాలు, సామాజిక, విప్లవ భావజాల ప్రదర్శనలో మమేకమైన వేదిక ఇది. నేడు సిద్దిపేటలోని విపంచి టౌన్‌హాల్‌లో వార్షికోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 28: ప్రజా ఉద్యమాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, విప్లవ రచయితల సంఘం ఇచ్చిన ప్రేరణతో కొంతమంది కవులు, రచయితలు ఏర్పాటు చేసుకున్న సంఘమే మరసం. ఉమ్మడి మెదక్ జిల్లాలో అభ్యుదయ భావాలు కలిగిన కవులందరినీ ఒక వేదిక మీదకు తెచ్చి సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలనే సంకల్పంతోనే ఈ సంఘం ఆవిర్భవించింది. 1986లో మొట్టమొదటి మరసం సభ సిద్దిపేటలో జరిగింది. నాటి కార్యక్రమానికి సాహితీవేత్త, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి హాజరయ్యారు. అప్పటి నుంచి సాహిత్య మంజీరా ప్రవాహం ప్రారంభమైంది. మంజీరా నదికి ఏడుపాయలు ఉన్నట్లే మంజీర రచయితల సంఘానికీ ఉమ్మడి జిల్లాలో ఏడు శాఖలను ఏర్పాటు చేశారు.



మంజీర రచయితల సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేటలో కవులు, రచయితల ర్యాలీ (ఫైల్)

సామాజిక ఉద్యమాల్లో కీలకంగా..

నాడు ఉమ్మడి మెదక్ జిల్లాను పట్టిపీడించిన మద్యపానంపై 'మరసం' గ్రామగ్రామాన చైతన్యాన్ని నింపింది. రాత్రి సమయంలో నాటక ప్రదర్శనలు నిర్వహించి మద్యపానంతో జరిగే అనర్థాలను కళ్లకు కట్టారు. తాగుడుకు బానిసైనవారి కళ్లను తెరిపించే ప్రయత్నం చేసింది మరసం. కవులు, రచయితలే వేషాలు ధరించి సామాజిక రుగ్మతలను తరిమికొట్టడంలో భేష్ అనిపించుకున్నారు. వరకట్న వ్యతిరేక ప్రదర్శనలు, అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా, అశ్లీల సంస్కృతిని నిరసిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా రైతుల ఆత్మహత్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఆత్మహత్యలు చేసుకొని కుటుంబాలను ఆగం చేయవద్దంటూ నాటకాలతో కనువిప్పు కలిగించిన సంఘమే మరసం. గుట్కాలు, పాన్‌మసాలా వ్యసనాలకు వ్యతిరేకంగా కవితలు, పాటలతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

స్వరాష్ట్ర పోరాటంలో...

"నాగేటి సాల్లల్ల నా తెలంగాణ.. నవ్వేటి బతుకుల్ల నా తెలంగాణ" అనే పాటతో స్వరాష్ట్ర ఉద్యమానికి ఊపిరిపోసిన రచయిత నందిని సిధారెడ్డి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఇద్దరూ మంజీర రచయితల సంఘం సభ్యులే. మరసం వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న నందిని సిధారెడ్డి సామాజిక ఉద్యమాలతో పాటు తెలంగాణ పోరాటంలోనూ తనదైన పాత్ర పోషించారు. మరసం ప్రభావంతోనే తెలంగాణ రచయితల వేదిక సైతం ఏర్పాటైంది. తెలంగాణ ధూంధాం ద్వారా తన ఆటపాటతో హోరెత్తించిన రసమయి బాలకిషన్‌కు ఈ సంఘమే ప్రేరణ. ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతతోపాటు ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని కళ్లకు కట్టడంలో 'మరసం' సభ్యుల పాత్ర అనిర్వచనీయం. 'తెలంగాణం' పేరిట తెలంగాణ పాటలు ప్రాచుర్యం పొందడంలోనూ ఈ సంఘం కీలకమైంది. నాగేటి సాల్లల్ల ఆడియో క్యాసెట్‌ను ఆవిష్కరించారు.

సభా వివాహాలతో ఆదర్శం

వివాహ వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో వరకట్న రహితంగా 'మరసం' ఆధ్వర్యంలో సభావివాహాలు జరిగాయి. మంత్రాలు, డప్పుచప్పుళ్లు, వరకట్నాల ప్రస్తావన లేకుండానే వధూవరులను ఒక్కటి చేసిన ఘనత 'మరసం'కు దక్కుతుంది. మాజీ ఎమ్మెల్యే, దివంగత సోలిపేట రామలింగారెడ్డి ,సుజాత వివాహంతో ఈ సభావివాహాలకు శ్రీకారం చుట్టారు. అనాడు ప్రజాకవి కాళోజీతోపాటు సాహిత్యకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇది ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు తెలంగాణ వ్యాప్తంగా నూతన ఒరవడికి నాంది పలికింది. నందిని భగవాన్‌రెడ్డి, వజ్రమ్మల వివాహాన్ని డాక్టర్ సి.నారాయణరెడ్డి జరిపించగా, బయ్యారం రాంరెడ్డి, పద్మల వివాహాన్ని ఎంటీ ఖాన్ చేతులమీదుగా జరిపించారు.

సామాన్యులకూ చేరువయ్యే కవిత్వం

సాధారణంగా కవితలను, కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే సాహిత్యంపై కొంత అవగాహన ఉండాలి. కానీ మరసం ద్వారా వెలుగులోకి వచ్చిన పలు కవితా సంపుటాలు అందరికీ అర్థమయ్యేలా ఉంటాయి. అందుకే త్వరగా జనంలోకి చొచ్చుకెళ్లి ప్రజలను ఆకర్షించడమేగాకుండా చైతన్యవంతులను చేశాయి. తెలంగాణ యాసలో వచ్చిన సంపుటాలు సైతం తట్టిలేపాయి. ఉనికి, భూమిస్వప్నం, సంభాషణ, ప్రాణహిత, నేల తడవని వాన, సంతకం, వరదగూడు, నెమలికన్ను, వనాన, వడిసెల, పానాది, గోరుకొయ్యలు, వయోలిన్ రాగమో, వసంత మేఘమో, సెలవింక అనే కవితా సంపుటాలు.. వ్యాస మంజీర, కదలిక, ఎడుపాయలు, మొగులైంది, పాట సంతకం అనే సంకలనాలు మరసం నుంచే వెలువడ్డాయి.

నేడు 38వ వార్షికోత్సవం

దాశరథి, ఆరుద్ర, బిరుదురాజు రామరాజుల శతజయంతి సందర్భంగా 'మరసం' 38వ వార్షికోత్సవ సమావేశాన్ని నేడు ఉదయం 10 గంటల నుంచి సిద్దిపేటలోని విపంచి టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొంటారు. ప్రముఖ కవి, కబీర్ సమ్మాన్ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి హాజరై ప్రసంగించనున్నారు. ఆరుద్ర సాహిత్య స్ఫూర్తి అనే అంశంపై నందిని సిధారెడ్డి, దాశరథి కవితా చైతన్యంపై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బిరుదురాజు రామరాజుపై సి.కాశీం ప్రసంగాలు ఉంటాయని మరసం అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి తెలిపారు.



మరసం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గొంతెత్తిన విప్లవ గాయకురాలు బెల్లి లలిత(ఫైల్)

ప్రజాదర్బార్ నిర్వహించిన జగ్గారెడ్డి

ప్రజల సమస్యలపై సుదీర్ఘ చర్చ

అక్కడిక్కడే వినతులు పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

సదాశివపేట హెల్త్ క్యాంపులో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 28: సంగారెడ్డి సమీపంలోని గణేశ్‌గడ్డ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు సంబంధించిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు వినతిపత్రాలు స్వీకరించారు. జగ్గారెడ్డి దృష్టికి అనేక సమస్యలు తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు.



సదాశివపేటలో ఉచిత హెల్త్‌క్యాంపులో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

ఉచిత హెల్త్‌క్యాంపులో నిర్మల జగ్గారెడ్డి


సదాశివపేట పట్టణంలో శనివారం నిర్వహించిన ఉచిత హెల్త్‌క్యాంపులో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఉచిత వైద్యారోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



గణేశ్‌గడ్డ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతీ పనికో రేటు!

- పంచాయతీ కార్యదర్శులపై ఆరోపణలు
- పట్టణాల పరిసర గ్రామాల్లో హవా
- పాలకవర్గాలు లేకపోవడంతో ఇష్టారాజ్యం
- అనుమతులు, మ్యుటేషన్లకూ మామూళ్లు
- తాజాగా ఏసీబీకి చిక్కిన సెక్రెటరీ
- మరికొందరిపైనా ఏసీబీకి ఫిర్యాదులు?



> 'ఇల్లు, విద్యుత్ కనెక్షన్ పేరు మార్పు కోసం ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా రూ. 25వేలు ఖర్చవుతుందని చెప్పిన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై వేటుపడింది. రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.'
>
> 'ఝరాసంగం మండలం మాచునూరులో గ్రామ కంఠంలోని ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు వేసి వాటిని తమ కుటుంబ సభ్యుల పేరిట కేటాయించిన పంచాయతీ కార్యదర్శి, ఎంపీఈవోలపై వేటు పడింది. ఇటీవల అధికారులు విచారణ చేసి నిజమని తేలడంతో ఇద్దరిపై చర్యలు తీసుకున్నారు.'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 28: విధి నిర్వహణలో భాగంగా చేయాల్సిన పనులకూ ఉమ్మడి జిల్లాలో కొందరు కార్యదర్శులు ధరలు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది చిత్తశుద్ధితో తమ గ్రామాల అభివృద్ధి కోసం శ్రమిస్తుండగా.. మరికొందరేమో అడ్డదారుల్లో సంపాదనకు అలవాటుపడి అవినీతికి పాల్పడుతున్నారు. తమ అధికారాలను అడ్డం పెట్టుకొని అక్రమాలకు దారులు వేస్తున్నారు.

కార్యదర్శుల హవా..

పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్, తూప్రాన్, మనోహరాబాద్, సిద్దిపేట అర్బన్, గజ్వేల్, నర్సాపూర్, హత్నూర, మాసాయిపేట, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పలు గ్రామాల కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాలకు సమీపంలో ఉండడం, పరిశ్రమలు విస్తరించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువగా జరగడంతో భూములకు డిమాండ్ ఏర్పడింది. పెద్ద సంఖ్యలో కొత్త ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పుట్టగొడుగుల వలె వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణానికి ఎన్‌వోసీలు, ఇతర అనుమతులు ఇవ్వాలంటే కార్యదర్శులు 'నాకేంటి' అని అంటున్నారు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, కొత్త విద్యుత్ మీటరు, బర్త్, డెత్ సర్టిఫికెట్లకు కూడా ధరలు నిర్ణయిస్తున్న కార్యదర్శులు ఉన్నారు.

అవినీతిపరులపై ఫిర్యాదులు..

ఇప్పటికే కొండాపూర్ పంచాయతీ సెక్రటరీని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇతని బాటలోనే మరికొందరిపైనా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ఇవ్వనిదే మ్యారేజ్, బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేయరని, పింఛన్ల పేరిట డబ్బులు అడుగుతున్నారని, ఏ పనికైనా ఒక రేటు కడతారని పలువురు కార్యదర్శుల గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కార్యదర్శులపై ఫిర్యాదులు వచ్చినా మొక్కుబడిగా స్వీకరిస్తున్నారని జిల్లా స్థాయి అధికారులపైనా ఆరోపణలు లేకపోలేదు. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులను జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సైతం ప్రోత్సహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదనే నెపంతో ఇటీవల కొందరు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇలా ఏసీబీ చేతిలో పలువురు కార్యదర్శుల అవినీతి చిట్టా కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక్కొక్కరిది ఒక్కోతీరు

పంచాయతీ కార్యదర్శుల్లో కొందరి అక్రమాల మూలంగా అందరిపైనా నిందలు పడుతున్నాయనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి చాలా గ్రామాల్లో నిధుల కొరత మూలంగా కార్యదర్శులు తమ సొంతంగా మరమ్మతు పనులు చేయిస్తున్నారు. అప్పులు తెచ్చి గ్రామాలకు ఖర్చు చేసి ఆ తర్వాత బిల్లులు పొందుతున్నారు. ఇంకొందరైతే గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, గ్రామంతోపాటు తమకూ పేరు రావాలని కష్టపడుతున్నారు. ఉదయం చెత్తసేకరణ నుండి రాత్రి వీధి దీపాలు వెలిగేవరకు తమ ముద్ర కనిపించేలా వ్యవహరిస్తున్నారు. కార్యదర్శుల్లో యువతీయువకులే ఎక్కువగా ఉండడంతో ఒక లక్ష్యంతో కృషి చేస్తున్నారు. కానీ కొంతమంది అవినీతికి పాల్పడుతూ అడ్డదారులు తొక్కుతున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రత్యేకాధికారులకూ పట్టింపు లేనందున ఇక కార్యదర్శులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కొందరేమో అక్రమాలకు అలవాటుపడుతూ అదనపు ఆదాయం పొందుతుండగా.. మరికొందరేమో తమ జేబుల్లో నుండే గ్రామాలకు వెచ్చిస్తూ నెట్టుకొస్తున్నారు.



ఉత్సాహంగా యువజనోత్సవాలు

భయం భయంగా..

7

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల చదువులు

బడికి పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు

మరమ్మతులకు నోచుకోని సర్కారు బడులు



వర్షపు నీరు కారుతున్న చింతలపల్లిలోని ప్రాథమిక పాఠశాల

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన న్యాయాధికారులు భవానీచంద్ర, లక్ష్మీశారద



లోక్‌అదాలత్‌లో ఆర్డర్ కాపీని అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, సెప్టెంబరు 28: జాతీయ లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర, మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 9 బెంచీల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 4,121 కేసులు పరిష్కరించారు. వివిధ కేసుల్లో బాధితులకు రూ.3,21,67,337 పరిహారాన్ని అందజేశారు. సివిల్ తగాదాలు 52, మోటార్ వెహికిల్ కేసులు 29, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 3,526, బ్యాంకు రికవరీ కేసులు 246, ఎస్ఐ యాక్టు కేసు ఒకటి పరిష్కరించారు. సైబర్‌క్రైం కేసులు 50, ప్రీలిటిగేషన్ కేసులు 5, విద్యుత్‌చౌర్యం కేసులు 212 కేసులు పరిష్కరించారు. పలు బ్యాంకు రికవరీ కేసులను పరిష్కరించి రూ.1.45 కోట్ల పరిహారం అందజేశారు.

మెదక్ జిల్లాలో 3,034 కేసులు

మెదక్ జిల్లావ్యాప్తంగా లోక్‌అదాలత్‌లో 3,034 కేసులు పరిష్కరించి, వివిధ కేసుల్లో రూ. 76,13,156 రికవరీ చేసినట్టు అధికారులు తెలిపారు. తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.జయంతి, రెండో అదనపు జిల్లా న్యాయాధికారి డా.కృష్ణార్జున్, నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి లావణ్య బాల్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణ్‌చారి, మొదటి అదనపు ప్రథమశ్రేణి జడ్జి శాలిని, స్పెషల్ ఎక్సైజ్ కోర్టు జడ్జి తేజశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాదికారి ప్రభుదాస్యం, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, జూనియ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్, న్యాయవాదులు, లీగల్ అథారిటీ సభ్యులు, సూపరింటెండెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రొటోకాల్ పాటించడం లేదని అసంతృప్తి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 28: ఎస్సీ ఎస్టీలపై దాడులు జరగకుండా అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆయన అసైన్డ్ భూములు, అట్రాసిటీ కేసులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతీ నెల పౌరహక్కుల దినోత్సవం, మూడు నెలలకోసారి మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మెదక్ పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ దుకాణ సముదాయాన్ని బినామీల నుంచి రక్షించాలన్నారు. మెదక్ జిల్లా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 26న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. తనకే అవమానం జరిగిందని, ఎస్సీ, ఎస్టీలకు అవమానం జరగదా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడానికి యంత్రాంగం తరఫున కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులు, దళిత సంఘాల సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం, మెదక్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

- నిజాంపేట: ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు అరికట్టి భూవివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా దళిత నాయకులు గర్నుల శ్రీనివాస్, దుబాషి సంజీవ్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.
- పాపన్నపేట: ఏడుపాయల వనదుర్గామాతను శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం దర్శించుకున్నారు. రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో చంద్రశేఖర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

సాంఘిక బహిష్కరణ నేరం

మనోహరాబాద్, సెప్టెంబరు 28: భారత రాజ్యాంగం ప్రకారం మనుషులందరూ సమానమేనని, వివక్ష చూపినా.. సాంఘిక బహిష్కరణకు పాల్పడినా చట్టరీత్యా నేరమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెంలో బహిష్కరణను గురైన దళిత కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. నిందితులను అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్‌రాం బాబునాయక్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, అదనపు కలెక్టర్ డీఎస్పీ, ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు 'భరోసా'

● సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు


కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ సంజీవరావు, సిబ్బంది

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 28: మహిళలు, బాలికల భద్రతకు 'భరోసా' కేంద్రం ప్రాధాన్యమిస్తుందని సంగారెడ్డి అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించడానికి అవసరమయ్యే అన్నిరకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 526 పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు మెడికల్, లీగల్ సేవలను అందించడంతోపాటు రూ.1.10 కోట్ల నష్టపరిహారం ఇప్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐ పూలబాయ్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలోనే వనదుర్గమాత ఆలయం


జలదిగ్బంధంలో ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం

పాపన్నపేట, సెప్టెంబరు 28: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద ఐదు రోజులుగా గంగమ్మ పరవళ్లు తొక్కుతుంది. సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతుండటంతో ఆలయం వద్ద వరద కొనసాగుతుంది. దీంతో ఆలయాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. శనివారం సైతం భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 26000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తుంది.

గౌరవెల్లి రిజర్వాయర్‌కు రూ.1000 కోట్లు ఇవ్వండి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి వినతి


ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 28 : శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్‌కు రూ. 1000 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు నిధులు లేక కెనాల్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని వెల్లడించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పునరావాస ప్యాకేజీ పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ముంపు బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఆలాగే గండిపల్లి రిజర్వాయర్ పనులు 50 శాతం పనులు మాత్రమే పూర్తయి పెండింగ్‌లో ఉందని తెలిపారు. గత 30 సంవత్సరాల నుంచి నత్తనడకన సాగుతున్న వరదకాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

భయం భయంగా..



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం



పై పెచ్చులూడిన తరగతి గది

● శిథిలావస్థలో సర్కారు బడులు ● బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల చదువులు
● బడికి పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు ● మరమ్మతులకు నోచుకోని వైనం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28 : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించి ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు శ్రమిస్తున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉండడంతో భయం భయంగా చదువుతున్నారు. కొన్ని పాఠశాలల్లో పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. బడులకు మరమ్మతులు చేయాల్సిన విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో చేసేది లేక శిథిలావస్థలోని భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న బడికి తమ పిల్లలను పంపిస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడిని మాన్పించారు.

5,680 మంది విద్యార్థులు..

మండలవ్యాప్తంగా మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలల్లో 5,680 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడుల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడిబాట కార్యక్రమంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని సంబరపడిపోయే అధికారులు, సర్కారు బడుల్లో పిల్లలు ఉండేలా చర్యలు తీసుకోవడం విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో వసతులు సరిగా లేక ప్రైవేటు స్కూళ్లలో చేర్పించిన దాఖలాలు ఉన్నాయి. మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులను ఆరుబయటే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తుండగా, చింతలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇదే గ్రామంలోని మరో ప్రాథమిక పాఠశాల వర్షానికి పదును వచ్చి గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇరిగిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నర్సరీ ఉండడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పిల్లలు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ భయంతోనే కొందరు పిల్లలను తల్లిదండ్రులు బడికి మాన్పించి, నర్సరీని ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారులకు విన్నవించారు. ఏదేమైనప్పటికీ శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చింతపల్లిలోని ప్రాథమిక పాఠశాల..

ఆరు బయటే పాఠాలు

నిజాంపేట, సెప్టెంబరు 28 : మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో విద్యార్థులే ఆరుబయట చెట్ల కింద, వరండాలో కూర్చొని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొన్నది. ఏడు సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు ఉన్నా కేవలం రెండు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా తరగతులు ఆరుబయటే నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటలు కూడా చెట్లకిందనే కానిస్తున్నారు. కనీసం పాఠశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో కోతుల బెడదతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలోకి పశువులు, కుక్కలు వస్తున్నాయని అధికారులు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు





చింతపల్లి పాఠశాల దుస్థితి



పెచ్చులూడడంతో బయట కూర్చున్న విద్యార్థులు

ఎనిమిది తరగతులు.. ముగ్గురే టీచర్లు..!

● అందులోనూ ఇద్దరు సెలవులో.. ఒక్కరితోనే బోధన



ఉపాధ్యాయులు లేక ఆటపాటలతో నిమగ్నమైన విద్యార్థులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 28 :ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తున్నామని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అమలుకావడం లేదు. అందుకు అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలనే నిదర్శనం. ఈ పాఠశాలలో 8 తరగతులకు గాను 84 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అనువుగా ఉపాధ్యాయులను నియమించకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులుండగా వారిలో ఇద్దరు సెలవులో ఉన్నారు. మిగిలిన ఒక్క టీచర్‌తోనే ఎనిమిది తరగతులకు విద్యాబోధన చేయడంపై స్థానికులు కొందరు శనివారం పాఠశాలను సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరతతో గత ఐదు రోజులుగా విద్యార్థులు ఆటపాటలకే పరిమితమవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలు జాన్సీని వివరణ అడగగా ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్, మరో ఉపాధ్యాయుడు దేవిసింగ్ సెలువులో ఉన్నరన్నారు. 8 తరగతులకు విద్యాబోధన చేయడం ఇబ్బందిగా ఉందన్నారు. అయితే తాము ముగ్గురమూ ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యామని, ఇక్కడికి టీచర్ల నియామకం జరగకపోవడంతో తాము రిలీవ్ కాలేదని తెలిపారు.

ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు



అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొండాపూర్, సెప్టెంబరు 28 : కొండాపూర్ మండలం గిర్మాపూర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఇంటర్మీడియట్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 300 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్-19 అథ్లెటిక్స్ ఎంపికల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో తలపడ్డారు. కార్యక్రమంలో డీఐఈవో గోవిందరామ్, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ధన్‌రాజ్, జుబేర్, మోహన్, బస్వరాజ్, రుక్మమ్మ, శశిరేఖ, మంజుల, మమత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై శిక్షణ



విజేతలతో డీఈవో వెంకటేశ్వర్లు, అధికారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యాశాఖ ఎస్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో అడాలసెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో(ఏఈపీ) భాగంగా పాఠశాల విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 84 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నుంచి విచ్చేసిన 84 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు పోస్టర్ మేకింగ్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు డీఈవో వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డానియల్, విద్యాశాఖ అధికారులు అనురాధ, వెంకటేశం, సిద్దారెడ్డి, సుప్రియ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు

● వర్గల్ టీజీఐఐసీ భూ నిర్వాసితులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

వర్గల్, సెప్టెంబరు 28 : తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని టీజీఐఐసీ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. సదరు భూముల వద్ద వారు చేస్తున్న ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకు అరకొర పరిహారంతో అందించి పరిశ్రమలకు రూ.కోటికి ఎకరం చొప్పున విక్రయించందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. ఇంటి స్థలాల ఎంపికలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు.

సమస్య పరిష్కారానికి కృషి : తహసీల్దార్


టీజీఐఐసీ భూనిర్వాసితుల సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు హామీ ఇచ్చారు. శనివారం ఆందోళనా శిబిరాన్ని సందర్శించిన ఆయనకు భూ నిర్వాసితులుకు తమ డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చుతామన్నారు.

అక్టోబరు 5వరకు ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28 : సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో 2008-డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం కొనసాగింది. ఈ ప్రక్రియను డీఈవో వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. 282 మందికిగాను ఇప్పటివరకు 176 మంది అభ్యర్థులు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా ఎవరైన అభ్యర్థులు ఉంటే అక్టోబరు 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని డీఈవో తెలిపారు.

ఎవరో ఈ బాలుడు

●మూడు నెలలుగా పోలీసుల సంరక్షణలో..



లభ్యమైన బాలుడు

చేగుంట, సెప్టెంబరు 28 : చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్ ఫాం వద్ద గత జూన్ 28న గుర్తుతెలియని వ్యక్తులు ఓ బాలుడిని ఒంటరిగా వదిలివెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని బాలుడిని చేరదీశారు. మూడు నెలలు గడిచినా బాలుడి ఆచూకీ కోసం ఎవరూ రాకపోవడంతో శనివారం బాలుడిని మెదక్‌లోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● కాంగ్రెస్ పాలనలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం
● అల్ఫోర్స్ విద్యా సంస్థల చెర్మన్ నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 28 : ప్రతీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వుట్కూరి నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో మంది డబుల్ పీజీలు, పీహెచ్‌డీలు చేసినప్పటికీ ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం పలువురు పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

హుస్నాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి హాజరై దుర్గామాత విగ్రహానికి పూజలు చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు నరేందర్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను వితరణ చేయగా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హెచ్ఎం వెంకటయ్య, పెరుమాండ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.



విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి



సింగూరు ప్రాజెక్టుకు తగ్గని వరద

●29.917 టీఎంసీలకు 29.768 టీఎంసీలు నిల్వ

పుల్‌కల్, సెప్టెంబరు 28: ఎగువ ప్రాంతాల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం తగ్గడం లేదు. శనివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి 14,531 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. వారం రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన గల మంజీర నుంచి వరద వస్తున్నది. శుక్రవారం ప్రాజెక్టులోకి 20,546 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం రావడంతో 6, 11వ నంబర్ క్రస్ట్‌గేట్లను రెండు మీటర్లు ఎత్తి 20,546 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రవాహం కొంతమేరకు తగ్గుముఖం పట్టడంతో 6వ నంబరు క్రస్ట్‌గేటును శనివారం సాయంత్రం మూసివేసినట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 11వ నంబరు క్రస్ట్‌గేట్ మీటరున్నర ఎత్తు ఎత్తి 8,142 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల గుండా 2,725 క్యూసెక్కుల వరద జలాలను దిగువన మంజీర రిజర్వాయర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 29.917 టీఎంసీలకు 29.768 టీఎంసీలు నీటి నిల్వలున్నాయి. ఇదిలావుండగా, మంజీర రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 7, 8వ నంబరు క్రస్ట్‌గేట్లను మూడున్నర మీటర్లు, 4వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మీటరు, ఒక స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

కదం తొక్కిన కార్మికలోకం

● కలెక్టరేట్ ముట్టడికి భారీగా కార్మికులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28 : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ శనివారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.29610 పెంచినట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కార్మికులు ఆ ప్రకటనను చూసి మోసపోవద్దన్నారు. ఇదే కొనసాగితే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి జీ. సాయిలు, పాండు, ప్రవీణ్, రాజయ్య, మహిపాల్, బాగారెడ్డి, బాబురావు, నాగేశ్వరరావు, సతీష్, కొండల్‌రెడ్డి, శోభ, రమాదేవి, రాజు., కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

ఉత్సాహంగా యువజనోత్సవాలు

● రాష్ట్రస్థాయికి 53 మంది ఎంపిక



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు : జిల్లా కేంద్రంలోని ఔవుట్‌డోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినుల ఆట, పాటలతో స్టేడియం హోరెత్తింది. జాతీయ నేతల వేషధారణతో వారిని అభినయిస్తూ సాగిన రూపకాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు కళల్లో రాణించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జానపద నృత్యం, గీతం, డ్యాన్స్, హస్త కళలు, కథా రచన, పెయింటింగ్ తదితర తొమ్మిది అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చి 53 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలలకు ఐఐటీహెచ్ చేయూత

●అక్షర్‌ధాన్‌లో భాగంగా కంప్యూటర్ల పంపిణీ

కంది, సెప్టెంబరు 28 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంగారెడ్డి జిల్లా కందిపరిధిలోని ఐఐటీ హైదరబాద్ చేయూతను అందిస్తుంది. పేద విద్యార్థులు డిజిటల్ విద్యను అభ్యసించేందుకు అక్షరమాల-అక్షర్‌ధాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఆన్‌లైన్ ద్వారా పాఠ్యాంశాలను బోధించడానికి కొంతమంది వలంటీర్లను సైతం నియమించింది. అక్షర్‌ధాన్‌లో భాగంగా శనివారం కంది మండలంలోని చిమ్నాపూర్, లక్ష్మినగర్‌కాలనీ, కలివేముల తదితర గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఐఐటీహెచ్ అధికారులు కంప్యూటర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిద్దిడానికి ఐఐటీహెచ్ కృషి చేస్తుందని, మారుమూల గ్రామాల విద్యార్థులు కూడా డిజిటల్ విద్యకు దగ్గరకావడానికి అక్షర్‌ధాన్ కార్యక్రమం చేపట్టామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.



కలివేముల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లను అందజేస్తున్న ఐఐటీహెచ్ అధికారులు

11 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

పటాన్‌చెరు, సెప్టెంబరు 28: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితుల నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శంబూసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లాకు చెందిన హర్షవర్ధన్ వేర్వేరు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నారని మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ సిబ్బంది అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు ఐదు లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.71వేలు చోరీ

రామాయంపేట, సెప్టెంబరు 28 : ఏటీఎంలో డబ్బులు కోసం ఓ రైతును ముగ్గురు వ్యక్తులు మోసం చేసి 71 వేలు డ్రా చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రామాయంపేటలోని ఎస్బీఐ ఏటీఎంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తితే మండలంలోని కాట్రియాలకు చెందిన రాజయ్య అనే రైతు ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న ముగ్గురు వ్యక్తులు అతన్ని మభ్యపెట్టి తమ వద్ద ఉన్న కార్డును ఏటీఎంలో పెట్టి అతని కార్డు లాగేశారు. ఇది గమనించని రాజయ్య వారు వెళ్లిన తరువాత డబ్బులు డ్రా చేయబోగా.. రాకపోయేసరికి వెళ్లి పోయాడు. కాగా, అదేరాత్రి అతనికి వచ్చిన ఫోన్ మెసేజ్ చూసుకొని నివ్వెరపోయిన రాజయ్య శనివారం పోలీసులను ఆశ్రయించాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



షాకీర్(ఫైల్

జహీరాబాద్, సెప్టెంబరు 28 : మండలపరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాలమధ్యలో గల నారింజవాగులో ఈ నెల 25న గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైందని తహసీల్దార్ రవీందర్, పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన షాకీర్ వాగులో గల్లంతవ్వగా నాలుగైదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా సత్వార్ గ్రామశివారులోని నారింజవాగులో ఒడ్డున అతడి మృతదేహం కనిపించింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

తూప్రాన్, సెప్టెంబరు 28: తూప్రాన్ పట్టణంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన అంసాన్‌పల్లి శ్రీనివాస్ రెడ్డి (50) కొన్నేళ్లుగా తూప్రాన్ మండలం శివ్వంపేటలో నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్‌రెడ్డి తూప్రాన్ పట్టణంలో పెట్రోల్ బంక్ సమీపంలో లిక్కర్ మార్టు వద్ద శనివారం ఉదయం శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న తూప్రాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



యాదగిరి (ఫైల్)

మిరుదొడ్డి, సెప్టెంబరు 28 : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాదగిరి(42) పొలం వద్ద బోరుమోటరు నడవకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదగిరి ఎంతకీ ఇంటికి రాకపోవడం అతడి తండ్రి లక్ష్మీనారాయణ పొలం వద్దకు వెళ్లిన చూడగా మృతిచెంది కనిపించాడు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవానికి పంచానామా నిర్వహించారు ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొట్టి యువకుడు..



నిరంజన్ (ఫైల్)

మనోహరాబాద్, సెప్టెంబరు 28: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన అర్కల నిరంజన్(26) గ్రామ శివారులోని పరిశ్రమలలో కూలీ పనులు చేసుకుంటూ సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కాళ్లకల్ శివారులోని రాఘవేంద్ర హోటల్‌లో భోజనం చేసి పక్కనే ఉన్న 44వ జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి నిరంజన్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రాంచందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యాధికారులకు ఆరోగ్య పరీక్షలు



సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కు బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి రక్తపోటు, మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలను శనివారం నిర్వహించారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డా.అనీల్‌కుమార్ రక్తపోటు, మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది 1,544 మందికి పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సిబ్బందికి పరీక్షలు నిర్వహించడంతో పాటు గుండె పోటు కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తెలిపారు.

ఖేడ్‌లో మున్సిపల్ కార్మికులకు..

నారాయణఖేడ్, సెప్టెంబరు 28: ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు వైద్యులు అరవింద్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన మందులను అందజేశారు. చెత్త సేకరణ, పారిశుధ్య పనుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కమిషనర్ జగ్జీవన్ వారికి అవగాహన కల్పించారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్ చౌహాన్, హన్మండ్లు పాల్గొన్నారు.

కోమటి కుంట.. తీరని తంటా

● ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్



వ్యర్థాలతో డంప్‌యార్డును తలపిస్తున్న కోమటికుంట

నర్సాపూర్, సెప్టెంబరు 28: నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని పట్టణానికి అతి సమీపంలో గల కోమటికుంటలో చెత్తచెదారం, వ్యర్థాలతో అధ్వానంగా మారింది. గత ఆగస్టు 6వ తేదీన జిల్లా ప్రత్యేక అధికారి, సీనియర్ ఐఏఎస్ భారతిహోళికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలో పర్యటిస్తూ ఈ కుంటను కూడా పరిశీలించారు. కుంటలో ఇష్టానుసారంగా వేస్తున్న చెత్త, వ్యర్థాలను తొలగించి వేసేవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. సమీపంలోని వ్యాపారులు, ఇళ్లకు చెందిన వారు కట్టకు ఆనుకుని కుంటలో పెద్దఎత్తున చెత్త, ఇతర వ్యర్థాలను వేస్తుండటంతో ప్రధానరోడ్డు పక్కన కుంట వద్ద ఓ డంపు యార్డును తలపిస్తున్నది. ఓవైపు స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నా మరోవైపు పట్టణానికి అతిసమీపంలో ఉన్న కుంట వద్ద అడ్డగోలుగా వ్యర్థాలు వేస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామకృష్ణను సంప్రదించగా కుంట వద్ద వ్యర్థాలను తొలగిస్తామని, అందుకు కారకులైనవారికి నోటీసులు జారీ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాజీపల్లిలో నీటి సమస్య తీర్చాలని మహిళల ఆందోళన

జిన్నారం, సెప్టెంబరు 28: కాజీపల్లిలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు ఆందోళనకు దిగారు. శనివారం కాజీపల్లిలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత 15 రోజులుగా గ్రామంలో బోరుమోటార్లు పని చేయక పోవడం, పైపులైన్లు లీకేజీలతో నీటి సరఫరా నిలిచిపోయిందని మాజీ సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. ప్రత్యేక అధికారులు గ్రామాన్ని సందర్శించడం లేదని, బోరు మోటార్లు, పైపులైన్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం వహించడంతో నక్రమంగా నీటి సరఫరా జరుగడం లేదని స్థానిక మహిళలు వాపోయారు. అధికారులు స్పందించి లోకల్ వాటర్, మంజీర నీటి సరఫరాను చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఖాళీ బిందెలు, బకెట్లతో ఆందోళన చేస్తున్న మహిళలు



తారా కళాశాలలో గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు

'తారా'లో గుర్రం జాషువా జయంతి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవుల్లో అత్యంత శక్తివంతమైన కవిత్వాన్ని రచించి సమాజాన్ని ప్రభావితం చేసిన కవి జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు నాగేశ్వరం శంకరం, శ్రీనివాసరావు, సుమతీదేవీ, సంధ్య అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'ఈటల'ను కలసిన బీజేపీ నాయకులు



మల్కాజిగిరి ఎంపీ ఈటలతో బీజేపీ నాయకులు

మనోహరాబాద్, సెప్టెంబరు 28: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మనోహరాబాద్ మండల బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పురం మహేష్ బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన సందర్భంగా శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీని కలిసినవారిలో పార్టీ నాయకులు నత్తి మల్లేష్, చంద్రశేఖర్, సాయిబాబా, మండల నాయకులు సత్యనారాయణ, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారిపై దాడి చేసిన నిందితులకు రిమాండ్

కోహీర్ సెప్టెంబరు 28: ఫారెస్ట్ అధికారిపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోహీర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం మండలంలోని సజ్జాపూర్ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నంపై జహీరాబాద్ మండలం మల్‌చెల్మా తండాకు చెందిన రాథోడ్ దశరథ్, రాథోడ్ సురేష్ కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధిత అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

కుక్కకాటుతో జాగ్రత్తగా ఉండాలి

జహీరాబాద్, సెప్టెంబరు 28: కుక్కకాటుతో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డా.కైలాష్ తదితరులు సూచించారు. శనివారం డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో కుక్కకాటుతో జరిగే నష్టం, వ్యాధులు సోకే విధానం తదితరాలపై పస్తాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుక్క కాటువల్ల రేబిస్ వ్యాధి వస్తుందని తెలిపారు. కుక్కలు కరిచిన వెంటనే చికిత్స చేసుకోవడంలో నిర్లక్ష్యంచేస్తే ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్



సంగారెడ్డి శాంతినగర్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌లో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28 : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హై స్కూల్‌లో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను పోస్టర్లు, చిత్రపటాలు, రాత పూర్వకంగా ప్రదర్శించారు. విద్య గొప్పతనాన్ని, తమలో దాగి ఉన్న ప్రతిభను విద్యార్థులు అద్భుతంగా చాటారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సల్మోన్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఇరిగిపల్లిలో పింఛన్లు పంపిణీ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28: సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో శనివారం వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతువులకు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నరేందర్ పింఛన్ డబ్బు పంపిణీ చేశారు. గ్రామంలో వృద్ధాప్య, వితంతు, పింఛన్‌లు రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 పింఛన్‌లు మొత్తం 105 మందికి పంపిణీ చేశారు.

పీఆర్టీయూ నూతన కమిటీ

మునిపల్లి, సెప్టెంబరు 28: మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని శనివారం మండలంలోని బుదేరా చౌరస్తాలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా గంధం మల్లికార్జున్, అసోసియేట్ అధ్యక్షుడిగా బాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య, కార్యదర్శిగా సిద్దేశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, మహిళా కార్యదర్శిగా అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

'జీవో 25ని సవరించాలి'

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28: అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూపీఎస్‌సీ) నాయకులు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు వై. అశోక్‌కుమార్, జ్ఞానమంజరి, జిల్లా నాయకులు సాయిలు, రామచందర్, శ్రీనివాస్‌రావు, లక్ష్మయ్య యాదవ్, శ్రీనివాస్‌రావు, విజయభాస్కర్, సంయుద్దీన్, జగన్నాథం, అనురాధ, గోపాల్, చందర్‌రాథోడ్, వెంకయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో తుది ఓటర్ల జాబితా

కోహీర్, సెప్టెంబరు 28: మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో 47,319 మంది ఓటర్లు ఉన్నట్లు కోహీర్ మండల ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇటీవల ఆయా గ్రామాల్లో చేపట్టిన వార్డుల విభజన, సవరణ తర్వాత మండల వ్యాప్తంగా 47,319 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. సెప్టెంబరు 28వ తేదీన మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తుది ఓటరు జాబితాను ప్రదర్శించామని తెలిపారు.

● చిన్నశంకరంపేట: మండలంలోని ఎంపీపీ కార్యాలయంలోని ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి శనివారం ఓటరు సవరణ జాబితా తుది లిస్టును విడుదల చేశారు.

● వెల్దుర్తి: పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను శనివారం వార్డుల వారీగా విడుదల చేసినట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. మండలంలోని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. వెల్దుర్తి ఉమ్మడి మండలంలో 32 గ్రామ పంచాయతీలలో 274 వార్డులు ఉన్నాయని, 33023 మంది ఓటర్లు ఉన్నారని ఇందులో 15,925 మంది పురుషులు, 17,097 మంది స్త్రీలు, ఒకరు ఇతరులు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పథకాల అమలుపై దృష్టి

తూప్రాన్, సెప్టెంబరు 28: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతీ కృష్ణ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల అమలులో ముందంజలో ఉంటుందని తెలిపారు. శనివారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆరో వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

నేటి యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్



జహీరాబాద్ పట్టణంలో భారీకటౌట్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న భగత్‌సింగ్ అభిమానులు

భగత్‌సింగ్ 117వ జయంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల్లో, పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసి నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని పలువురు కొనియాడారు.

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్/నారాయణఖేడ్, సెప్టెంబరు 28: సంగారెడ్డిలోని భగత్‌సింగ్ విగ్రహానికి ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ భగత్ సింగ్ జీవిత చరిత్రను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, సహా కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని మాస్టర్‌మైండ్ కళాశాలతో పాటు ఇతర విద్యాసంస్థల్లో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మతోన్మాదాన్ని నిర్మూలిస్తేనే భగత్‌సింగ్‌కు ఘనమైన నివాళి అని తెలిపారు. ఆయన ఆశయసాధన దిశగా మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా భగత్‌సింగ్ అభిమానులు పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భగత్‌సింగ్ భారీకటౌట్‌తో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరీశ్, అతిక్, సురేష్ ఆకాశ్, భగత్‌సింగ్ అభిమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు శంకర్, అశోక్, నిఖిల్, రోహిత్, అరవింద్, ఈసీన్, మనోహర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

టేక్మాల్/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 28: దేశయువత భగత్‌సింగ్ త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యవర్గ సభ్యుడు రాజు పేర్కొన్నారు. శనివారం టేక్మాల్ మండలకేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు,మండల ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, మండల బీజేపీనాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డును పరామర్శించిన నిర్మలాజగ్గారెడ్డి



గోపాల్‌ను పరామర్శిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

కంది/కొండాపూర్, సెప్టెంబరు 28 : హోంగార్డు గోపాల్‌కు మెరుగైన వైద్యం అందించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఏఐజీ ఆస్పత్రి డాక్టర్‌లకు సూచించారు. ఈ నెల 26న కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగిస్తున్న క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన హోంగార్డు గోపాల్ తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి అతడిని తరలించారు. శనివారం ఏఐజీ ఆస్పత్రిలో హోంగార్డు గోపాల్‌ను, అతడికుటుంబసభ్యులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి కలిసి ధైర్యం చెప్పారు.

ఘనంగా కోటి క్షమాపణ యజ్ఞం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 28: తిరుమల తిరుపతి దేవస్థానంలో మహా ప్రసాదమైన లడ్డూను అపవిత్రం చేశారంటూ శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో క్షమా ప్రార్థన, కోటి క్షమాపణ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం చుట్టూ 11సార్లు ప్రదక్షిణలు చేస్తూ.. 108సార్లు గోవిందనామ సంకీర్తన, పారాయణాలు చేపట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

ఏఈవోల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 28: వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల పరిష్కరించాలని శనివారం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. డిజిటల్‌క్రాప్ సర్వే పేరుతో ప్రభుత్వం ఏఈవోలపై అదనపు భారాన్ని మోపుతుందన్నారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఈ విధానం నుంచి ఏఈవోలకు మినహాయింపు ఇవ్వాలని, లేని పక్షంలో గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, సభ్యులు ఉన్నారు.

చదువుకు తగిన ప్రాధాన్యత: ఖేడ్ ఎమ్మెల్యే



జ్యోతిబాపూలే విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 28: కాంగ్రెస్ ప్రభుత్వం చదువుకు మొదటి ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాల, మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులం, సాంఘిక సంక్షేమం బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్యోతిబాపులే బీసీ బాలుర గురుకులంలో తరగతి గదులను సందర్శించి బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారితో కలిసి భోజనం చేశారు. గురుకుల ఆవరణలో మరమ్మతులతో పాటు ఇతర అవసరమైన పనులన్నీ దసరా సెలవుల్లో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో అవసరమైన పనులకుగాను ఇంజనీరింగ్‌శాఖ అధికారులను పిలిపించి అంచనాలు రూపొందించాలని సూచించారు. కన్వెన్షన్ హాల్ ముందు జాతీయ రహదారిపక్కన ఖాళీ స్థలం ఉండటంతో మున్సిపాలిటీ తరఫున దుకాణాలను ఏర్పాటు చేయించి, అద్దెకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దారం శంకర్‌కు సూచించారు. వెంట కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాధికారుల బదిలీలు సహజమే

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 28: ప్రభుత్వాధికారులు బదిలీలు సహజమేనని సిర్గాపూర్ మండల ఎంఈవో ఎస్.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలపరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలో గత 11 సంవత్సరాల నుంచి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల నల్లగొండ జిల్లాకు బదిలీపై వెళ్తున్న రమేష్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సిర్గాపూర్ ఎంఈవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎస్.రమేష్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, బాస్కర్, ప్రిన్సిపాల్‌సువర్ణ, పాఠశాలసిబ్బంది విద్యార్థులుపాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కల్హేర్, సెప్టెంబరు 29: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, దీనికి తల్లిదండ్రులు, పాఠశాలు, కళాశాలల్లో గురువులు అందించే సూచనలు, సలహాలు తప్పకుండా పాటిస్తే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామని ప్రేరణ సంస్థ ప్రతినిధి సంతోష్‌కుమార్ అన్నారు. సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో బంగారు తల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సత్ప్రవర్తన తదితర విషయాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్వేత సంతోష్‌కుమార్, సిర్గాపూర్ మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేళాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి

పెద్దశంకరంపేట,సెప్టెంబరు 28: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్య వైజ్ఞానిక మేళాలు ఎంతో దోహద పడతాయని ఎంఈవో వెంకటేశం అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని పాఠశాలలో నిర్వహించిన మేళాలో విద్యార్థులు ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మంథని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ నాగనాథరావు, వినోద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ పరిశుభ్రతను పాటించాలి

● పలు మండలాల్లో స్వచ్ఛతాహీ సేవా



కంది: మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొక్క నాటి నీరుపోస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

జహీరాబాద్, సెప్టెంబరు 28: అందరు పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె. సూరీక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి.అనూష పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోర్టు ఆవరణలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను వారు సిబ్బందితో కలిసి తొలగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆచార్య డిగ్రీకళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్‌తో కలిసి ఆస్పత్రి పరిసరాలను చీపుర్లతో శుభ్రం చేశారు.

● కంది: మండలపరిధిలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం డీఈవో వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, ఉపాధ్యాయులు బోధన తీరును పరిశీలించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పాఠశాల ఆవరణలో సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. డీఈవో ఒక మొక్క నాటి నీరు పోశారు.

● మునిపల్లి: మండల పరిధిలోని అంతారం గ్రామంలో ప్రధాన వీధులతో పాటు జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్‌లో ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. అంతకు ముందు ఎంపీడీవో పంచాయతీలో రికార్డులను పరిశీలించారు.

● వట్‌పల్లి: మండలంలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో రామలింగం ఎంపీవో క్వాజా నసీరుద్దీన్ విద్యార్థులతో కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు.

● జిన్నారం: మండలంలోని గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ కాలనీలో మమతా మెడికల్ అకాడమీ వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. బొల్లారం మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పలు చోట్ల పరిసరాలను శుభ్రపరిచారు.

● కల్హేర్: మండలకేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో రమేష్‌బాబు, ఎంఈవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణచారి, ఈజీఎస్ ఎపీఏ రఘువీర్ తదితరులు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శ్రమదానం చేశారు.

● టేక్మాల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీపీవో యాదయ్య అన్నారు. శనివారం టేక్మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పరిసరాలను స్వచ్ఛంగా ఉండేలా చూడాలని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

● చిన్నశంకరంపేట: స్వచ్ఛతతో వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో దామోదర్ అన్నారు. స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలోని పలు శాఖలకు చెందిన సిబ్బంది పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు.

పౌరహక్కులపై గ్రామస్థులకు అవగాహన



అల్లాదుర్గం: బహిరన్‌దిబ్బలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

మెదక్ జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి బాల్యవివాహాలు, అంటరాని తనం నేరమని, బాల కార్మికులతో పని చేయించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

నర్సాపూర్, సెప్టెంబరు 28: బాల్య వివాహాలు, అంటరాని తనం అనేది చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మసలుకోవాలని తహసీల్దార్ కె.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని మాదాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లల చేత పనులు చేయించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, ఆర్ఐ, గ్రామస్థులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: గ్రామాల్లో ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. శనివారం వెల్దుర్తిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఈవో బలరాంరెడ్డి, ఏఎస్ఐ సాదత్‌మియా, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● మాసాయిపేట: మాసాయిపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. రామంతపూర్ తండా, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామస్థుల పౌర హక్కులపై వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి దన్‌సింగ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: ప్రజలు అంటరాని తనం పాటించవద్దని తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని బహిరన్‌దిబ్బ, చిల్వేర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఐకమత్యంగా ఉండాలంటూ గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు కొర్మిని ప్రభు, ఏఎస్ఐ దేవిదాస్, ఇన్‌చార్జి ఎంపీవో లింగప్ప పాల్గొన్నారు.

● హవేళిఘణపూర్: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో తహసీల్దార్ సింధూ రేణుక ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిర్దావర్ ఆబేద్, ఇన్‌చార్జి ఎంపీవో వెంకటేశం, గ్రామ ప్రత్యేకాధికారి సల్మాన్, కార్యదర్శి శ్రీశైలం, పోలీసు అధికారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: ప్రతి ఒక్కరు ఐక్యత కలిగి ఉండాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం చిన్నశంకరంపేట మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు జీవన శైలిపై అవగాహన కల్పించారు. సూరారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● రేగోడు: ప్రజలు అందరూ సమానమేనని, గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి పాటించరాదని తహసీల్దార్ నరేష్ అన్నారు. శనివారం రేగోడు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్ఐ ఫిరోజ్, ఏఎస్ఐ మల్లయ్య, ఎంపీడీవో సీతారావమ్మ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: సమాజంలోని అసమానతలు, కుల వివక్ష, అంటరానితనం, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ సురేష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, సెక్రటరీ నర్సింలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులవి నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట, సెప్టెంబరు 28: గోమారం ఘటనలో బీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని, చంద్రాగౌడ్ మాధవరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టారని అవగాహన రహితంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సరైంది కాదని కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు ఖండిస్తూ శనివారం గోమారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రాగౌడ్ అవకాశవాది అని, సొంత గ్రామాభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదని మాధవరెడ్డి యూత్ విభాగం నుంచే రాజకీయంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులపై భూ ఆక్రమాలు చేసినట్లు ఆధారాలు చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే చంద్రాగౌడ్ చేసిన భూఆక్రమాలు తాము బయటపెడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, వేణు రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

ఉమా కేదారేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పాపన్నపేట, సెప్టెంబరు 28: ఉమా కేదారేశ్వర క్షేత్రం నాగ్‌సానిపల్లి గ్రామంలో శనివారం మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మ ప్రసాద్ గుప్తా దంపతులు స్వామివారికి పాదపూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజశేఖర్ శర్మ, శ్యాంసుందర్ శర్మ, రామ్ శర్మ, యాదన్న గుప్తా, నర్సింలు గుప్తా, ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్ గుప్తా, రవీందర్ గుప్తా, వీరేశం గుప్తా తదితరులు పాల్గొన్నారు.